భీమిలి గ్రీవెన్స్ సెల్ అధ్యక్షునిగా శినగం రాంబాబు

విశాలాంధ్ర - ఆనందపురం : ఆనందపురం మండలం గిడిజాల పంచాయతీకి చెందిన శినగం రాంబాబుకు భీమిలి నియోజక వర్గం గ్రీవెన్స్ సెల్ అధ్యక్షునిగా, వైసీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర కార్యాలయం నుంచి నియామక పత్రం అందించారు. పార్టీ స్థాపన నుంచి పార్టీ కోసం నిరంతరం కష్టపడి పని చేస్తూ, క్రమ శిక్షణతో పాటు నియమ నిబద్ధతతో పని చేశారు. ఈ సందర్భంగా రాంబాబు తనకు ఈ పదవి రావడం చాలా ఆనందంగా ఉందని అధినేత జగన్మోహన్ రెడ్డికి, భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీను, మండల పార్టీ ప్రెసిడెంట్ బంక సత్యం, జడ్పిటిసి కోరాడ వెంకటరావు, మండల వైస్ ఎంపీపీ పాండ్రంకి. శ్రీనుమండల వైసీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కార్మికుల జోలికొస్తే ఖబడ్దార్

- ఏఐటీయూసీ నేత ఎస్.కె రెహమాన్
- సీపీఐ జిల్లా నాయకులు ఆర్. శ్రీనివాస్

విశాలాంధ్ర - పెందుర్తి : కార్మికుల జోలికొస్తే ఖబడ్దార్ అంటూ ఏఐటీయుసీ నేత ఎస్.కే.రెహమాన్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. చిరు వ్యాపారుల ఆస్తులను ధ్వంసం చేసే హక్కు అధికారులకు ఎవరు ఇచ్చారని సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు ఆర్. శ్రీనివాసరావు ప్రశ్నించారు. శ్రీ ముత్యమాంబ చిరు వ్యాపారస్తుల సంఘం 627/2014 గుర్తింపు సంఘం గౌరవ అధ్యక్షులు వై రాంబాబు అధ్యక్షతన జీవీఎంసీ 93 వ వార్డు పరిధిలోని నాయుడుతోట గాయత్రి ఆలయం సమీపంలో వేపగుంట, సింహాద్రి నగర్, ప్రహ్లాదపురం, నాయుడుతోట వ్యాపారుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో భవిష్యత్తు కార్యాచరణపై చర్చలు జరిపారు. ముందుగా ఏఐటీయూసీ పతకాన్ని ఎస్.కె రెహమాన్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ చిరు వ్యాపారులకు ముందస్తుగా సమాచారం లేకుండా వ్యాపారులు తొలగించడమే కాకుండా వారి ఆస్తులను ధ్వంసం చేయడం దారుణమని మండిపడ్డారు. ఒకరి ఆస్తిని ధ్వంసం చేయడం వారి ప్రాథమిక హక్కును కాలరాయడమేనని కోర్టులు పలుమార్లు తీర్పులు ఇచ్చాయని వెల్లడించారు. అలాంటి చర్యలు రాజ్యాంగా విరుద్ధమని పేర్కొన్నారు. తక్షణమే కార్పొరేటర్లు జీవీఎంసీ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి యథావిధిగా వ్యాపారాలు చేసుకోనివ్వాలని డిమాండ్ చేశారు. ఈ దేశంలో గుర్తింపు పొందిన యూనియన్ లో ప్రథమ స్థానం ఏఐటీయూసీది అని తెలిపారు. కార్మికుల హక్కులకోసం శతాబ్దం నుంచి అలుపెరగని పోరాటాలు చేస్తు ఎన్నో విజయాలు సాధించిందని కొనియాడారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యాపారుల ఆస్థులను ధ్వంసం చేసే హక్కు అధికారులకు ఎవరు ఇచ్చారని నిలదీసారు. ప్రజల సొమ్ముతో విలాసాలు తిరిగి చిరు వ్యాపారులు, కార్మికులను కార్పొరేటర్లు గాలికివదిలేశారని విమర్శించారు. మేయర్, కార్పొరేటర్లకు తెలియకుండానే అధికారులు ఇంత దారుణానికి ఒడిగట్టారా అని మండిపడ్డారు. జీవీఎంసీ పాలకవర్గం హాకర్ జోన్ ఏర్పాటు చేసేంత వరకు చిరువర్తకులు తమ వ్యాపారాలు కొనసాగించటానికి నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేసారు. అదికారులు స్పందించకపోతే ఎర్రజెండా చేతపట్టి దశల వారీగా ఉద్యమాలను ఉద్రుతం చేస్తామని శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈ సమావేశంలో వ్యాపారుల సంఘం ప్రెసిడెంట్ ఈశ్వరావు, సెక్రటరీ నాగరాజు,వైస్ ప్రెసిడెంట్ శరత్, జాయింట్ సెక్రటరీలు ప్రదీప్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పంచకర్ల ఆర్థిక సాయంతో వృద్ధులకు వీల్ చైర్లు

విశాలాంధ్ర - పెందుర్తి : పెందుర్తి ఎమ్మెల్యే, ఉమ్మడి విశాఖ రూరల్ జిల్లా జనసేన అధ్యక్షులు పంచకర్ల రమేష్ బాబు ఆర్థిక సహాయంతో సమకూర్చిన వీల్ చైర్లను అర్హులైన వృద్ధులకు ఎన్డీఏ కూటమి నాయకులు ఆదివారం అందచేసారు. జీవిఎంసీ 94, 95 వార్డులు పరిధిలోని పురుషోత్త పురంలో అర్హులైన వృద్ధులకు 30 వేలు విలువచేసే 3 వీల్ చైర్లను పెందుర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉరిటి లక్కీగోవింద్ చేతుల మీదుగా అందచేసారు. ఈ సందర్భంగా లక్కీ గోవింద్ మాట్లాడుతూ మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు అని కొనియాడారు. ఎవరికి ఏ అవసరం వచ్చినా వెంటనే స్పందించే నాయకుడు పెందుర్తి ఎమ్మెల్యే కావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెందుర్తి తెలుగు యువత అధ్యక్షులు కోటిబోని శ్రీను యాదవ్, చీర రాజు, కోరాడ శ్రీను, దాకారపు ఈశ్వరరావు, జోగి ఏర్నిరాజు, బాదంపూడి కృష్ణ, ఉరిటి శ్రీను, నమ్మి అశోక్, రాజేష్, హర్షవర్ధన్, శేఖర్, కృష్ణ, సింగంపల్లి మోహన్ తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుండి మినహాయింపు ఇవ్వాలి

ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు విజ్ఞప్తి

విశాలాంధ్ర - విశాఖ సిటీ : ఇన్ సర్వీస్ ఆధ్యాయులకు పరీక్ష నుండి మినహాయింపు ఇవ్వాలని ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల సుప్రీం కోర్ట్ తీర్పును అనుసరించి ఐదు సంవత్సరాల కు పైబడి సర్వీసు ఉన్న ప్రతి ఉపాధ్యాయుడు టెట్టు పరీక్ష నుండి అర్హత సాధించాలని లేనియెడల ఉపాధ్యాయునిగా కొనసాగే అర్హత లేదని స్పష్టం చేయడంతో ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో ఆందోళన మొదలయ్యిందన్నారు. రాష్ట్రంలో 1995 నుండి వేరు వేరు డీఎస్సీ ల ద్వారా ఇప్పటివరకు అనేక వేల తమంది ప్రభుత్వ ఉపాధ్యాయులుగా నియమించబడినారని, వారందరిలో టెట్ నిబంధన తీవ్ర సమస్యగా ఉందన్నారు. విద్యాహక్కు చట్టం 2010 ద్వారా పాఠ శాలలో ఉపాధ్యాయులుగా నియామకం కోసం విద్యా, వృత్తి అర్హతలతో పాటు ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్‌లో కూడా ఉత్తీర్ణత సాధించడం తప్పనిసరి చేసింది. 23. 8. 2010 నుండి ఈ నిబంధన దేశంలోని అన్ని రాష్ట్రాలలో కొత్త ఉపాధ్యాయ నియామకాల విషయంలో అమలవుతుందని పేర్కొన్నారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్ట్ సివిల్ అప్పీల్ నెంబర్ 1385 / 2025 తేదీ 1.9. 2025 ద్వారా టెట్ పై ఇచ్చిన తీర్పుతో ప్రస్తుతం పని చేస్తున్న లక్షల మంది ఉపాధ్యాయులు టెట్ అర్హత సాధించలేని ఎడల భవిష్యత్తులో పదోన్నతికి అర్హత కోల్పోవడమే కాకుండా ఉద్యోగాన్ని కూడా కోల్పోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్ట్ తీర్పును అనుసరించి 2010 కి ముందు నియమించబడిన వారు కూడా కచ్చితంగా టెట్ అర్హత పరీక్ష పాస్ కావాలి. మన రాష్ట్రంలో 1.9.2030 లోపు పదవీ విరమణ చెందే ఉపాధ్యాయులు గాకుండా ఆ తరువాత పదవీ విరమణ చెందే ప్రతి ఉపాధ్యాయుడు కచ్చితంగా టెట్ అర్హత పరీక్ష పాస్ కావలసి ఉందన్నారు. 31. 8. 2027 లోపు టెట్ ఉత్తీర్ణత సాధించాలి లేనిచో పదోన్నతులు నిలిపివేయబడతాయని, తప్పనిసరి పదవీ విరమణ లేదా ఉద్యోగం నుండి తొలగిస్తారన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులందరూ ఉపాధ్యాయ ఉద్యోగాన్ని పొందడానికి బిఈడి అర్హత సాధించి శిక్షణ కాలం పూర్తి చేసుకొని, డీఎస్సీ ద్వారా ప్రతిభ పరీక్షలో వారి సామర్థ్యాన్ని ప్రతిభ పాటవాలను నిరూపించుకొని ఉద్యోగం సాధించా రన్నారు. కాబట్టి 2010కు ముందు నియమించబడిన ఉపాధ్యాయులకు అర్హత పరీక్ష నుండి మినహాయింపు ఇచ్చే విధంగా ప్రభుత్వం సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

అప్పలరాజుకి ఘన సన్మానం

విశాలాంధ్ర - తగరపువలస : చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎన్.ఎం.ఎం.ఎస్ శిక్షణ కేంద్రంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, సంఘసంస్కర్త, జీవీఎంసీ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఉన్నత పాఠ శాలలో తెలుగు పండితుడిగా పని చేస్తున్నటువంటి రెడ్డిపల్లి అప్పలరాజు కి ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. ఈ సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీవి అప్పారావు డాక్టర్ విఎస్ కృష్ణ కాలేజ్ సూపరిండెంట్ వారు హాజరై వారిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి శ్రీ రేఖ అప్పారావు మాస్టర్ , శివ భౌతికశాస్త్ర నిపుణులు, అదే విధంగా మహేష్ ఫ్రెండ్ ఎడ్యుకేషన్ సొసైటీ వ్యవసాపకులు గంటనా మోహన్ రావు సంస్థ కోఆర్డినేటర్ భరత్ పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ పిల్లలకు కావలసినటువంటి మెటీరియల్ అందిస్తామని, ఈ సంస్థకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తానని తెలియజేశారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి అప్పారావు వారిని అభి నందించారు. భరత్ వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది.

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లేక సిటీకి వలసలు

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : గ్రామీణ ప్రాంతాల్లో సరైన ఉపాధి లేక విశాఖ నగరానికి, ఇతర సిటీ లకు గత కొన్ని సంవత్సరాలుగా గ్రామీణ ప్రజలు పని నిమిత్తం వలస వస్తున్నారని, వారికి సరైన వసతి, విద్య,వైద్యం పట్టణ ప్రణాళిక సంస్థ వారు కల్పించలేక పోతున్నారని కర్షక దేవోభవ జాతీయ ఛైర్మెన్ డా ఆడారి కిషోర్ కుమార్ అన్నారు. ఈ సమస్య భారతదేశంతో పాటు ఆసియా ఖండం మొత్తం అభివృద్ధి చెందుతున్న నగరాల్లో ఇంకా కనిపిస్తూనే ఉందన్నారు. ఈ సమస్య పరిష్కారానికి ఒక నివేదిక రూపొందించి విశాఖ జీవిఎంసీ వారికి ఒక ఇవ్వనున్నట్లు తెలియజేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ లో జరిగిన జాతీయ స్థాయి సెమినార్ లో డా ఆడారి కిషోర్ కుమార్ పాల్గొని మాట్లాడారు. ఆంత్రోపాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ ప్రొఫెసర్ ఇన్ ఆంత్రోపాలజీ ప్రో. బి.వి శర్మ పదవి విరమణ సందర్భంగా ఈ జాతీయ స్థాయి సెమినార్ ను డా ఎన్ శ్రీనివాస్ కన్వీనర్ , హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ ప్రో.రమేష్ సింగ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమం కు అతిథులుగా ఏఎస్ పిఐ నేషనల్ కమిషనర్,కిషోర్ బాషా, డిల్లీ యూనివర్సిటీ, జె ఎన్ యూ , పాండిచ్చేరి యూనివర్సిటీ, ఉత్కల్ యూనివర్సిటీ మరియు వివిధ జాతీయ స్థాయి సంస్థల ప్రతినిధులు ప్రాతినిధ్యం వహించారు.

పాత్రికేయులు వృత్తిలో రాణిస్తూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

విశాలాంధ్ర - విశాఖ సిటీ : పాత్రికేయులు తమ వృత్తిలో రాణిస్తూ ఆరోగ్యం శ్రద్ధ వహించాలని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి హితవు పలికారు. ఆదివారం పౌర గ్రంథాలయంలో నిర్వహించిన స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఎస్‌సిఆర్‌డబ్ల్యుఏ) నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఒత్తిడితో పని చేసే పాత్రికేయులు ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇటీవల కాలంలో పాత్రికేయులు గుండెపోటుతో మరణిస్తున్న సంఘటనలు తనను తీవ్రంగా కలచి వేస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్యం, ఆదాయం ఈ రెండు అంశాలు ప్రధానమన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా రావడంతో పాత్రికేయ పని ఒత్తిడి తీవ్రమైందన్నారు. దాన్ని బ్యాలెన్స్ చేసుకుంటూ విధులు నిర్వహించాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బంగారు అశోక్ కుమార్ మాట్లాడుతూ 2016 లో స్థాపించిన ఈ సంస్థ దిన దిన ప్రవర్తమానమై పాత్రికేయులకు, ప్రజలకు ఎంతగానో చేరువైందని చెప్పారు. వృత్తి నైపుణ్యం కోసం కార్యశాలలు, సభ్యుల మానసిక ఆనందం నిమిత్తం సాహస క్రీడలు సహా సంక్షేమ కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ నూతన కార్యవర్గం రెండేళ్ల పాటు పదవిలో ఉంటుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ ఇండియాకు చెందిన స్కూల్ ఆఫ్ జర్నలిజం అండ్ కమ్యూనికేషన్ చైర్మన్ నాగనబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ అశోక్ కుమార్ నేతృత్వంలో పదేళ్ల క్రితం ఆవిర్భవించిన స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అనతి కాలంలోనే జర్నలిస్టులకు చేరువైందని అన్నారు. సంక్షేమ కార్యక్రమాలు, సాహస క్రీడలు, కార్యశాలలు ఇలా ఎన్నో కార్యక్రమాలతో ఈ సంస్థ అభివృద్ధి బాటలో పయనిస్తోందని తెలిపారు. ఆత్మీయ అతిథిగా పాల్గొన్న ప్రజాకవి,సీనియర్ జర్నలిస్ట్ మజ్జి దేవిశ్రీ తన పాటలతో ఎస్సీఆర్డబ్ల్యూఏ నూతన కార్యవర్గ సభ్యుల్లో చైతన్యం నింపారు. అనంతరం ముఖ్య అతిథి పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సభ్యులందరినీ ఉచిత రీతిన సత్కరించారు. నాయకత్వంలో ఉన్న వారందరికీ గుర్తింపు కార్డులు అందజేశారు.

కార్యవర్గం : స్మార్ట్ సిటీ రిపోర్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ సలహాదారులు.. నాగబోయిన నాగేశ్వరరావు, బి.ఎస్. చంద్రశేఖర్, మజ్జి దేవిశ్రీ. అధ్యక్షులు..బంగారు అశోక్ కుమార్ (వార్త). 6 గురు ఉపాధ్యక్షులుగా, జనరల్ సెక్రెటరీ: ఎన్. అశోక్ రెడ్డి (ఎస్‌డివి న్యూస్) 5గురు ఆర్గనైజింగ్ సెక్రటరీలు. 7గురు సెక్రెటరీలు. 7గురు జాయింట్ సెక్రెటరీలు. ట్రెజరర్: కె.సత్యనారాయణ (పబ్లిక్). 5గురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎల్ఐసి విశ్రాంత మేనేజర్ మృతి



విశాలాంధ్ర - తగరపువలస : జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి) విశ్రాంత మేనేజర్ మాదాబత్తుల పైడిశెట్టి (87) మృతి. పాల కొండ, నర్సీపట్నం, శ్రీకాకు ళం, విశాఖ, గాజువాక బ్రాంచ్లో మేనేజర్ గా పని చేశారు. ఆయన స్వస్థలం తగరపువలస రాజవీధి. ప్రస్తుతం విశాఖపట్నం మురళినగర్ లో భార్య పార్వతి తో కలిసి నివాసం ఉంటున్నారు. ఈయన మృతి పట్ల పద్మశాలి సంఘం నాయకులు, సీనియర్ సిటిజన్ , పింఛన్ దారుల సంఘ నాయకులు పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

చందక గ్రామంలో 3000 మందికి భారీ అన్న సంతర్పణ

విశాలాంధ్ర - ఆనందపురం : ఆనందపురం మండలం చందక గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ దుర్గా దేవి శరన్నవరాత్రి మహోత్సవములులో భాగంగా చందక గ్రామంలో భారీ ఎత్తున అన్న సంతర్పణ కార్యక్రమం గ్రామస్తులంతా కలిసి అంగరంగా వైభవం గా నిర్వహించారు. భవాని భక్తులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారినీ దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మంచుతో ప్రతిష్ఠించిన శివలింగం ప్రత్యేక ఆకర్షణ గా నిలిచింది.చందక యువత, గ్రామస్తులంతా పాల్గొన్నారు.

నేడు రెడ్డిపల్లి, తునవలస గ్రామాల్లో రామాలయాల పునః నిర్మాణానికి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శంకుస్థాపన

విశాలాంధ్ర - పద్మనాభం : మండలం రెడ్డిపల్లి. తుని వలస గ్రామాల్లో పురాతన రామాలయాల స్థానంలో కొత్త ఆలయాలు నిర్మించేందుకు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సోమవారం ఉదయం 10 గంటలకు శంకుస్థాపన కార్యక్రమం చేయనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు కోరాడ రమణ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు గ్రామ కమిటీ అధ్యక్షులు అభిమానులు పిఎస్సిఎస్ అధ్యక్షులు తదితరులు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఘనంగా దుర్గాదేవి అమ్మవారి సారే ఊరేగింపు

విశాలాంధ్ర - ఆనందపురం : దుర్గాదేవి నవ రాత్రుల్లో భాగంగా ఆనందపురం మండలం బంటుపల్లి వారి గ్రామపంచాయతీ అయ్యప్ప స్వామి పీఠం వద్ద దుర్గాదేవి అమ్మవారు భవానీ మాల ధారణ తీసుకున్న భక్తులు ఆదివారం అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పీఠం వద్ద నుంచి స్థానిక రామాలయం వరకు పల్లి పేట, తాతయ్య గారి కల్లాలు, మచ్చవానిపాలెం, వరకు భక్తులు భక్తి పాటలతో వాయిద్యాలతో భక్తి శ్రద్ధలతో అమ్మవారికి సారే కార్యక్రమం నిర్వ హించారు. భవాని భక్తులు ఈ కార్యక్రమానికి నలుమూలల నుంచి హాజరై అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక అలంకరణతో చీర,సారే కానుకలు అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా గురుభవానిలు బత్తుల శ్రీనివాసు, దొంతల పాపారావు మాట్లాడుతూ నవరాత్రుల్లో భాగంగా అమ్మ వారికి ఈ కార్యక్రమం నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని ప్రతి ఏడాది ఇలా నిర్వహించడం జరుగుతుందని భక్తిశ్రద్ధలతో పండగ వాతావరణం లాగా కార్యక్రమం నిర్వహించబడుతుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో బంటుపల్లి శ్రీనివాసరావు, భవాని భక్తులు, స్థానిక ప్రజలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సోమవారం జీవీఎంసీలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం లోను, అన్ని జోనల్ కార్యాలయాలలోనూ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం' 2025 సెప్టెంబర్ 29 వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు నిర్వహించబడునని విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పత్రికా ప్రకటన ద్వారా ఆదివారం తెలిపారు. కావున, నగరంలో పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, నీటి సరఫరా, వీధి దీపాలు,హార్టికల్చర్, రెవిన్యూ, యు సి డి, ఇంజినీరింగ్ మొదలగు జీవీఎంసీ విభాగాలకు సంబంధించిన సమస్యలపై సెప్టెంబర్ 29 వ తేదీ సోమవారం ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంట వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర ప్రజలు అర్జీల ద్వారా సమస్యలను తెలియపరుచుకోవచ్చునని నగర ప్రజలకు విశాఖ నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ తెలియచేశారు.

పినగాడిలో భారీ అన్నసమారాధన

ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణమూర్తి

విశాలాంధ్ర - పెందుర్తి : పెందుర్తి మండలం, పినగాడి గ్రామంలో దసరా శరన్నవరాత్రి మహోత్స వాలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి. ఆ గ్రామానికి చెందిన టీడీపీ సీనియర నాయకులు ఖైలపూడి ఉమామహేశ్వరావు దంపతులు ఆద్వర్యంలో ప్రతీరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుపుతున్నారు. అలాగే ఆదివారం గ్రామంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. సుమారు మూడు వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యన్నారాయణ మూర్తి ముఖ్యఅతిధిగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అలాగే శివయ్య ఫాల్జీ బ్రిక్స్ ఇండస్ట్రీస్ లో, నిర్వాహకులు ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు ప్రసాదాలను వడ్డించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ ఇటీవల కాలంలో ప్రజల్లో భక్తిభావం పెరిగిందని, అన్ని ప్రాంతాల్లోను ఆద్యాత్మిక కార్యక్రమాలు విరివిగా నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. అలాగే పినగాడిలో భారీ కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఖైలపూడి ఉమామహేశ్వరావు దంపతులను బండారు అభినందించారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : సోమవారం, 29వ తేదీన విశాఖపట్నం కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం - పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కార్యక్రమం జరుగుతుందని, అన్ని శాఖల జిల్లా అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలని చెప్పారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్‌కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోను చెక్ చేసుకోవచ్చన్నారు. అర్జీదారులు మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ సూచించారు. అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చన్నారు. అర్జీదారులు వారి అర్జీలు నమోదు చేసుకోవడానికి Meekosam.ap.gov.in వెబ్సైట్‌ను సంప్రదించవచ్చని సూచించారు.

మాస్టర్ ప్లాన్ రహదారులకు శంకుస్థాపన

విశాలాంధ్ర - విశాఖ : వీఎంఆర్డీఏ చేపట్టిన ఏడు మాస్టర్ ప్లాన్ రహదారులకు చైర్మన్ ప్రణవ్ గోపాల్ అడవివరం జంక్షన్ లో ఆదివారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ.175 కోట్ల ఖర్చుతో 26.72 కిలోమీటర్ల పొడవు 7 ప్రధాన బృహత్తర ప్రణాళిక రహదారులను నిర్మించనున్నారు. ఈ సందర్భంగా వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్ గోపాల్, భీమిలి శాసన సభ్యులు గంటా శ్రీనివాసరావు, మెట్రోపాలిటన్ కమీషనర్ కె.ఎస్. విశ్వనాథన్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆలోచనలకు అనుగుణంగా విశాఖను అభివృద్ధి పథంలో నడిపించడములో వీఎంఆర్డీఏ ప్రధాన భూమిక పోషిస్తోందని తెలిపారు. దానిలో భాగంగానే బృహత్తర ప్రణాళిక రహదారులను అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన చేస్తున్నామన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఈ రహదారులు అనుసంధానం చేస్తాయని తెలిపారు. నించే ముఖ్యమైన రహదారులని, జాతీయ రహదారి పై ఒత్తిడి తగ్గుతుందని, త్వరగా విమానాశ్రయానికి చేరుకోవడంలో ఈ రహదారులన్నీ దోహదపడతాయన్నారు. చిప్పాడ - పోలిపల్లి, నేరేళ్ల వలస - తాళ్ళవలస, బోయపాలెం - కాపులుప్పాడ, గంభీరం రహదారి, గంభీరం - పరదేశి పాలెం, అడివివరం - గండిగుండం, శివశక్తి నగర్ రహదారులను అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో 98వ వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్ మధుసూధనరావు, ఉప కార్యనిర్వహక ఇంజనీర్లు విశ్వనాథ్, రవిశంకర్, సహాయక ఇంజనీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి అమ్మవారికి సారే సమర్పణ

విశాలాంధ్ర - పద్మనాభం : మండలం అనంతరం గ్రామంలో వార్డు సభ్యులు సిద్ధనాతి రమణమ్మ వెంకట్రావు దంపతుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వారి ఆధ్వర్యంలో సోమవారం వెయ్యి ఒక రకాల స్వీట్ పదార్థాల సారే వస్తువులను గ్రామ ప్రధాన విధులు ఊరేగించి. అమ్మ వారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళలు యువకులు పాల్గొన్నారు.

నేషనల్ హైవే స్థలాలు కబ్జా

- ఆక్రమణలు ఆపై అద్దెలు
- దర్జాగా పాగా.. ఆపై అమ్మకాలు
- లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నా బడా బాబులు
- వేములవలసలో అక్రమ నిర్మాణాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

విశాలాంధ్ర - ఆనందపురం : ప్రభుత్వ స్థలాలు ఎక్కడపడితే అక్కడ కబ్జా చేస్తున్న వైనం మనం చూస్తున్నాం, అది ఏ స్థలమైన ఏ ప్రదేశం అయినా బడా బాబులు కన్ను పడిందంటే కబ్జా అవ్వాల్సిందే, జాతీయ రహదారి నేషనల్ హైవే స్థలాన్ని కొందరు దర్జాగా చదును చేసుకుని, ముందుగా ఒక ఏటీఎం కు అద్దెకి ఇచ్చి, మిగిలిన స్థలాన్ని చదును చేసి లక్షల్లో అద్దెలకు ఇవ్వడం చర్చనీ యాంశంగా మారింది. ఆనందపురం మండలం వేములవలస కూడలి ప్రాంతంలోని ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది అక్రమంగా ఆక్రమించి పక్కా నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. మార్కెట్ పక్కనే ఉండడం వలన నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో ఏటీఎం సెంటర్, హోటల్ ఏర్పాటు కోసం ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. లక్షల్లో అడ్వాన్సులు తీసుకొని వేలల్లో అద్దెలకిస్తూ మిగతా స్థలాన్ని స్థలం మాదే అంటూ క్రయవిక్రయాలు జరుగుతున్నారు. బంటుపల్లి కల్లాల రోడ్డు, తగరపువలస రోడ్డు మలుపు వద్ద పక్కా నిర్మాణాల ప్రయత్నాలు జరుగుతున్నాయి. రోడ్డు విస్తరణకు కోసం అధికారులు స్థలం కేటాయించి కొంతమేర రోడ్డు ఏర్పాటు చేసి మిగిలిన ప్రాంతాన్ని వదిలివేశారు. ఇదే అదునుగా చూసుకొని దాన్ని కొంతమంది ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు తెలిపారు. పేదవారు చిన్న తోపుడు బళ్లు పెట్టినప్పుడు అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తే, పెద్ద నిర్మాణాలు చేసుకునే వ్యక్తులను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. కొన్నేళ్ల నుండి ఇప్పటివరకు ఖాళీగా ఉండే నేషనల్ హైవే వారి స్థలాలను ఇష్టానుసారంగా కబ్జా చేసి రాత్రికి రాత్రే నిర్మాణాలు చేపడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో ఇలాంటి నిర్మాణాలు కొనసాగితే రోడ్డు ట్రాఫిక్, రద్దీ సమస్యలు, మరింత తీవ్రంగా పెరుగుతాయని, అధికారులు పరిశీలించి ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గుండె ఆరోగ్యంపై 'కిమ్స్' అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - విశాఖ సిటీ : కిమ్స్ హాస్పిటల్స్ సీతమ్మ ధారలో "అంతర్జాతీయ హృదయ దినోత్సవం" సందర్భంగా ఆదివారం వాక్‌థాన్ నిర్వహించారు. ర్యాలీలో గుండె ఆరోగ్యంపైఅవగాహన కలిగించారు. ఈ సందర్భంగా కార్డియాలజీ చీఫ్ కన్సల్టెంట్ డాక్టర్ గణేష్ కాశీనాథుని మాట్లాడుతూ గత కొంతకాలంగా వయస్సుతో సంబంధం లేకుండా గుండె సంబంధిత ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. యువత సహా ప్రతి ఒక్కరూ గుండె ఆరోగ్యంపై అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆరోగ్య సమస్యలను ముందుగా గుర్తిస్తే నివారించ గలుగుతామని చెప్పారు. ముఖ్యంగా గుండె సమస్యలు పెరగడానికి జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఒత్తిడి ప్రధాన కారణాలుగా ఉన్నాయని వివరించారు. మితిమీరిన వ్యాయామం కూడా ప్రమాదకరమే అని ఆయన హెచ్చరించారు. వాక్‌థాన్‌లో హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ బి. విజయ్ కుమార్, సీఓఓ డాక్టర్ శ్రీధర్, కార్డియాలజీ విభాగం డాక్టర్ గరికపాటి మహేష్, డాక్టర్ సిదార్థ, హాస్పిటల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుపాలెంలో భారీ అన్నసంతర్పణ

విశాలాంధ్ర - పద్మనాభం : మండలంలోని పాండ్రంగి పంచాయతీ మధుర గ్రామమైన ఏనుగుపాలెంలో ఆదివారం భారీ ఎత్తున అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించి నట్లు ఆ గ్రామ దుర్గాదేవి ఉత్సవ కమిటీ సభ్యులు తెలియజేశారు. గ్రామ పెద్దల సమక్షంలో ముందు గానే నిర్ణయించిన సెప్టెంబర్ 28వ తారీకున ఈ అన సంతార్పణకు ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. దుర్గాదేవి అమ్మవారు మండపంలో ఉదయం నుంచి విశేష పూజలు ప్రత్యేక పూజలు కుంకుమ పూజలు నిర్వహించి అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సుమారు 1500 మంది భక్తులకు ప్రసాదం అందించినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దుర్గాదేవి ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక గ్రామ పెద్దలు, నాయకులు,యువత తదితరులు పాల్గొన్నారు.

అమెరికాలో అంతర్జాతీయ విజిటర్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్ (ఐవీఎల్పీ)కి

డా.బి.ఆర్. అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ ఎంపిక

ఏయూ నుంచి ప్రొఫెసర్ జేమ్స్ స్టీఫెన్‌కు అరుదైన గౌరవం

- నలుగురు మాజీ ప్రధానిల సరసన చోటు

- భారతదేశం నుంచి ఒకే ఒక ప్రతినిధిగా ఎంపిక

విశాలాంధ్ర - విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొఫెసర్‌కు అరుదైన గౌరవం లభించింది. భారతదేశం నుంచి మాజీ ప్రధానుల తర్వాత ఒక ఆచార్యునికి ఈ తరహా గౌరవం దక్కడం ఇదే ప్రథమం. అమెరికా ప్రభుత్వం నిర్వహించే అత్యంత ప్రతిష్టాత్మక కార్యక్రమాలలో ఒకటైన ఇంటర్నేషనల్ విజిటర్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్ (ఐవీఎల్పీ)లో పాల్గొనడానికి డా. బి.ఆర్. అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ మేకా జేమ్స్ స్టీఫెన్ ఎంపిక అయ్యారు. సెప్టెంబర్ 27 నుండి అక్టోబర్ 18 వరకు యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలో జరగనున్న ఈ కార్యక్రమంలో భారతదేశం నుండి ఏకైక ప్రతినిధిగా ప్రొఫెసర్ స్టీఫెన్ పాల్గొంటున్నారు. కార్యక్రమంలో భాగంగా మూడు వారాల పాటు అమెరికాలోని వాషింగ్టన్ డి.సి, సాన్ డియోగో-కాలిఫోర్నియా, ఫీనిక్స్-ఆరిజోనా, నార్త్‌కరోలీనా రాష్ట్రాలను సందర్శించి యూనివర్సిటీ ఎంగేజ్‌మెంట్ అనే అంశముతో కూడిన కార్యక్రమములలో పాల్గొంటారు. విభిన్న అంశాలపై నిర్వహించే కార్యక్రమాలు, సదస్సులలో పాల్గొని భారత దేశం తరపున ప్రత్యేక ప్రసంగాలు అందిస్తారు. ఈ కార్యక్రమానికి ప్రపంచ వ్యాప్తంగా 25 దేశాల నుంచి కేవలం 25 మందిని అమెరికా ప్రభుత్వం ఎంపిక చేసి ఆహ్వానించింది. అదే విధంగా వీరిని అమెరికా ప్రభుత్వ అతిధులుగా ఆహ్వానిస్తూ ప్రత్యేక వీసాను (జే - 1) సైతం అమెరికా ప్రభుత్వం మంజూరు చేసింది.

ఐవిఎల్‌పి కార్యక్రమం వివరాలు....

1940లో ప్రారంభమైన ఇంటర్నేషనల్ విజిటర్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్ (ఐవిఎల్‌పి) యు.ఎస్. డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్టేట్ యొక్క బ్యూరో ఆఫ్ ఎడ్యుకేషనల్ అండ్ కల్చరల్ అఫైర్స్ యొక్క ప్రధాన కార్యక్రమం. అమెరికన్ రాజకీయ, ఆర్థిక, సామాజిక మరియు సాంస్కృతిక జీవితం యొక్క విశిష్టతను, వైవిధ్యాన్ని చూపడం, నేటితరం యువ, వర్ధమాన నాయకులకు అవకాశం కల్పించడం ద్వారా ప్రపంచ సహకారం, నాయకత్వం మరియు పరస్పర అవగాహనను పెంపొందించడం ఈ కార్యక్రమం లక్ష్యం.

గతంలో భారత దేశం నుంచి ఈ కార్యక్రమానికి ఎంపిక కాబడి, ఆహ్వానం పొందిన వారిలో భారతదేశ మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ (ఐవిఎల్‌పి 1961), అటల్ బిహారీ వాజ్‌పేయి భారతదేశ ప్రధాని (ఐవిఎల్‌పి 1960) మొరార్జీ దేశాయ్ భారతదేశ ప్రధాని (ఐవి ఎల్‌పి 1962), భారతదేశ ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోడీ (ఐవిఎల్‌పి 1993), మాజీ రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ (ఐవిఎల్‌వి 1999)లు ఉన్నారు. ఇటువంటి ప్రతిష్టాత్మకమైన గౌరవాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన ఆచార్య ఎం. జేమ్స్ స్టీఫెన్ పొందడం, శతాబ్ది ఉత్సవాలను జరుపుకుంటున్న ఈ తరుణంలో విశ్వవిద్యాలయానికి విశిష్టమైన గుర్తింపు, గౌరవాన్ని అందిస్తోంది. ప్రొఫెసర్ మేకా జేమ్స్ స్టీఫెన్ ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో భాగస్వామ్యం కావడం వలన, ఆంధ్ర విశ్వవిద్యాలయం ప్రపంచ వేదికలపై విద్యా, సామాజిక రంగాలలో తన ప్రతిష్టను చాటుతూ, బలమైన నాయకత్వం మరియు నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుంది అనడంలో సందేహం లేదు. ఈ సందర్భంగా భారత ప్రభుత్వ, సామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వ శాఖకు చెందిన డా. అంబేద్కర్ ఫౌండేషన్ ఆచార్య జేమ్స్ స్టీఫెన్ సాధించిన అరుదైన గౌరవం పట్ల తమ సంతోషాన్ని వ్యక్తం చేసింది. ఈ విశిష్ట గుర్తింపు తో దేశానికి, ఫౌండేషన్‌కు మరియు మంత్రిత్వ శాఖకు గౌరవం తెచ్చినందుకు ప్రొఫెసర్ స్టీఫెన్‌కు హృదయపూర్వక

అభినందనలు తెలియజేశారు. ఐవీఎల్పీలో భాగస్వామ్యం కేవలం ఒక విద్య, వృత్తిపరమైన విజయం మాత్రమే కాదు, ఇది నాయకత్వం, అంతర్జాతీయ సహకారాన్ని పెంపొందించగల సామర్థ్యాన్ని గుర్తించడానికి దోహదపడుతుంది. ప్రొఫెసర్ స్టీఫెన్ యొక్క ప్రాతినిధ్యం ప్రపంచ సమాజంతో భారతదేశం యొక్క మేధో మరియు సాంస్కృతిక సంబంధాలను బలోపేతం చేయడానికి దోహదం చేస్తుంది, అదే సమయంలో ఆంధ్ర విశ్వవిద్యాలయ ఘనమైన వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పడానికి ఉపకరిస్తుంది. సంవత్సరాలుగా ఐవీఎల్పీ ప్రపంచ నాయకత్వ వారసత్వాన్ని నిర్మించింది. 500 మందికి పైగా పూర్వ విద్యార్థులు దేశాధినేతలు లేదా ప్రభుత్వ అధినేతలుగా ఎదిగారు. వారిలో మార్గరెట్ థాచర్ (యునైటెడ్ కింగ్‌డమ్), అన్వర్ ఎల్-సదాత్ (ఈజిప్ట్), ఆండ్రూ హోల్నెస్ (జమైకా), మరియు ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, జర్మనీ, దక్షిణ కొరియా వంటి దేశాల నుండి అనేక మంది అధ్యక్షులు ప్రధాన మంత్రులు, అదేవిధంగా భారతదేశ ప్రస్తుత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కూడా ఉన్నారు. ఈ ఆలుమ్ని నెట్‌వర్క్‌లో 12 మంది నోబెల్ గ్రహీతలు, 1,600 మందికి పైగా క్యాబినెట్ మంత్రులు, 1,000 మందికి పైగా పార్లమెంట్ సభ్యులు, మరియు వ్యాపారం, విజ్ఞానశాస్త్రం, విద్య మరియు ప్రభుత్వ సేవలలో ప్రముఖ వ్యక్తులు ఉన్నారు.

జాతీయ చౌక్ బాల్ పోటీల ముగింపు వేడుకకు ముఖ్య అతిథిగా సీపీ శంఖబ్రత బాగ్చి

- బాలుర టీం విజేతగా ఢిల్లీ టీం - రన్నర్స్ గా మహారాష్ట్ర

- బాలికల టీం విజేతగా పశ్చిమబెంగాల్ - టీం రన్నర్స్‌గా మహారాష్ట్ర

సిపి చేతుల మీదుగా అసెంట్ స్కూల్ ప్రిన్సిపల్ కొలగాని శంకరరావుకు ఘన సన్మానం

విశాలాంధ్ర - అనందపురం : 16వ జాతీయ చాక్ బాల్ పోటీలు మూడు రోజులుగా అసెంట్ స్కూల్ వేదికగా జరిగిన పోటీలు ఆదివారం ఘనంగా ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖపట్నం సిపి శంకబ్రత భాగ్చి హాజరయ్యారు. 22 రాష్ట్రాల నుండి 32 టీములు పాల్గొన్న ఈ పోటీలలో బాలుర టీం విజేతగా ఢిల్లీ టీం, రన్నర్స్‌గా మహారాష్ట్ర టీం, తృతీయ స్థానంలో అస్సాం టీం, నిలిచారు. బాలికల టీం విజేతగా పశ్చిమబెంగాల్ టీం రన్నర్స్ గా, మహారాష్ట్ర టీం తృతీయ స్థానంలో అస్సాం టీం నిలిచారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీ చేతుల మీదగా క విజేతలకు బహుమతులను అందించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ దేశ నలుమూలల నుండి క్రీడాకారులు పాల్గొన్న ఈ వేడుకకు తనను ముఖ్యఅతిథిగా ఆహ్వానించడం ఎంతో ఆనందదాయకంగా ఉందని , ఆనందపురం మండలంలో ఇటువంటి క్రీడా పోటీలను మరిన్ని నిర్వహించి విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల ప్రాముఖ్యతను తెలియజేయాలని, స్కూల్ యాజమాన్యాన్ని కోరారు. అసెంట్ స్కూల్ ప్రిన్సిపల్ కొలగాని శంకరరావును, డైరెక్టర్ బంగారు నాయుడు లను సిపి ఘనంగా సన్మానించారు. గెలుపొందిన క్రీడాకారులను అభినందిస్తూ బహుమతులను అందించారు. మరో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కోరాడ రాజబాబు మాట్లాడుతూ దేశంలోని వివిధ రాష్ట్రాల విద్యార్థులు ఇలా తన సొంత నేలైన ఆనందపురం మండలంలో అడుగుపెట్టి పోటీలలో పాల్గొనడం తనకు ఎంతో గర్వకారణంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించి అసెంట్ స్కూల్ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎటువంటి ఆటంకం కలగకుండా నిర్వహించినందుకు పాఠశాల యాజమాన్యాన్ని, ఉపాధ్యాయ తర సిబ్బందిని అభినందించారు.

యువశక్తి శ్రమశక్తిగా మారిన నాడే దేశం అభ్యున్నతి చెందుతుంది

ఆర్ఎస్ఎస్ విశాఖ జిల్లా సహకార్యవాహ తమ్మిన నర్సింగరావు

ఘనంగా గాయత్రి డిగ్రీ కాలేజ్ పెస్ట్

విశాలాంధ్ర - ఆనందపురం : యువశక్తి తన మేధస్సుతో శ్రమ శక్తిని తీర్చి దిద్దితే దేశ అభ్యున్నతి సాధ్యమవుతుందని ఆర్ఎస్ఎస్ విశాఖ జిల్లా సహకార్యవాహ తమ్మిన నర్సింగ్ రావు అన్నారు. ఆదివారం ఆనందపురం గాయత్రి డిగ్రీ కళాశాల లో గాయత్రి డిగ్రీ కాలేజ్ ఫెస్ట్ టు కె 25 కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ మేరకు విద్యార్థులు ఉద్దేశించి తమ్మిన నర్సింగ్ రావు మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక యువతి కలిగిన దేశం భారతదేశం అన్నారు. యువ శక్తిని మేధో శక్తిగా మార్చి భారతదేశం విశ్వ గురువుగా మారుతుందన్నారు. భగత్ సింగ్ రాజ్ గురు సుఖదేవ్ చంద్రబోస్ చంద్రశేఖర్ ఆజాద్ వంటి యువత దేశ స్వతంత్రం కోసం పోరాడితే స్వాతంత్ర్యం సిద్ధించిందన్నారు. ఈరోజు మనం ఎటువంటి పోరాటాలు చేయాల్సిన అవసరం లేదు గాని డ్రగ్స్ కి బానిస కాకుండా జీవితాన్ని ఉన్నతంగా మలుచుకుంటే దేశానికి సమాజానికి ఉపయోగకరమైన వ్యక్తులుగా తయారీ కాగలరన్నారు. ప్రతి ఒక్కరూ చేసే పని దైవంగా భావించి పనిచేసిన రోజున చేసే పని చిన్నది పెద్దది అన్న ఆలోచన రాదన్నారు. విజ్ఞాన్ విహార గుడిలావ కమిటీ డైరెక్టర్ బాలి రవి మాట్లాడుతూ మనల్ని మనం తెలుసుకోవడమే జీవితం అన్నారు. అటువంటి తెలుసుకోవడానికి ఒకప్పుడు గురుకురాలు ఉండేవని నేడు ఆ పాత్రని విద్యాలయాలు పోషిస్తున్నాయన్నారు. గురు శిష్య సంబంధాల మధ్య ఆధునికత వచ్చినప్పటికీ గురువు స్థానము చాలా ఆదర్శనీయమన్నారు. జీవితంలో ప్రతి చోట గురువు చెప్పే జీవితంలో ప్రతి చోట గురువు చెప్పే మాట ఉపయోగపడుతుందని గురువుని నమ్మడమే ఈ దేశ సంస్కృతిని ఋషుల ద్వారా మనకు తెలుస్తుంది అన్నారు. కళాశాల ప్రధానాచార్యుడు దుఃఖమాట్లాడుతూ.. దుక్క అప్పలరాజు మాట్లాడుతూ... జీవితమంటే పరిగెత్తడం కాదని నేర్చుకుంటూ ముందుకు వెళ్లడమే జీవనం అన్నారు. పోరాటంతోనే విజయం వస్తుందని సాధన తోనే శక్తి సమకూరుతుందన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణుడు పోతిన సూరిబాబు మాట్లాడుతూ.... లక్ష్యంతో కూడిన చదువు ఉద్యోగ కొలువుని తెస్తే... మంచి ఆలోచనలతో పెరిగే వయసు వ్యక్తిత్వంతో కూడిన ఆదర్శవంతుడిని చేస్తుందని అన్నారు. ప్రపంచంలో మంచి ఎక్కడున్నా తీసుకోవలసిన బాధ్యత మనందరి పైన ఉందన్నారు. దేశ కాలమాన భవిష్యత్తులో ఆధారంగా చేసుకుని యువత ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కస్పాండెంట్ ఎర్రజి వెంకట్రావు మాట్లాడుతూ... విద్యార్థుల్ని ఉన్నతంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో 2014లో కళాశాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ బంటుబిల్లి .సత్యనారాయణ, అధ్యాపకులు సిహెచ్ సునీత, కే సోమేశ్వరరావు. టి.పద్మ ,ఎస్. ప్రియాంక, డి .రాజ్యలక్ష్మి, జి లక్ష్మణరావు తమ్మిన. ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమ సమాజ స్ఫూర్తి ప్రదాత గుర్రం జాషువా

బీజేపీ బీసీ నేత మూల వెంకటరావు

విశాలాంధ్ర - పెందుర్తి : గుర్రం జాషువా సమసమాజం కోసం పోరాడినయోధుడిగా చరిత్ర సజీవ సాక్ష్యం చెబుతుందని బిజెపి బీసీ నేత మూల వెంకటరావు పేర్కొన్నారు జాషువాను అంటరాని వానిగా కడగొట్టు వ్యక్తిగా ఆనాటి సమాజం వెలివేసిందని, దీంతో తీవ్ర అవమానాలను మానసిక శోభనం అనుభవించిన ఆయన సంఘసంస్కరణకు పూనుకొని గొప్ప విజయాలను అందుకున్నారని వెల్లడించారు. ఆయన రచనలోని అస్పృశ్యత మానసికక్షోభకు నివేదిక గబ్బిలం షాజహాన్ హృదయ నివేదిక ముంతాజ్ మహల్ తదితర గ్రంధాలు జాషువా కీర్తిని విశ్వవ్యాపితం చేశాయని తెలిపారు స్మశానములో పులిని మేకను పక్కపక్కనే పడుకోబెడతారని, అంటే ధనికా పేదలను స్మశానంలో ఒకటేనని ఆయన తన రచనల ద్వారా సమాజానికి వెల్లడించారన్నారు 1956లో జాషువా రూపొందించిన కొత్త లోకం కథానిక ప్రపంచాన్ని మేల్కొల్పిందని వెల్లడించారు జాషువా 130 జయంతి సందర్భంగా ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని మూల వెంకటరావు స్పష్టం చేశారు విశాఖలో బిజెపి ఆధ్వర్యంలో జాషువా జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ జీకేడీ ప్రసాద్ కి జాషువా రాష్ట్ర పురస్కారం

విశాలాంధ్ర - విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగ ఫ్యాకల్టీ డాక్టర్ జీకేడీ ప్రసాదరావుకి ఈ ఏడాది గుర్రం జాషువా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురస్కారం లభించింది. విజయవాడ ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ కార్యాల యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పింగళి వెంకయ్య సభావేదికలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ పుర స్కారంలో రూ.50,000 నగదు, ప్రశంసా పత్రం, శాలువా, పుష్పగుచ్ఛం అందించారు. డాక్టర్ జీకేడీ ప్రసాద రావు 2011లో "దళిత జర్నలిజం" గ్రంథం, దేశంలో దళిత ప్రశ్నకు సంబంధించిన వ్యాస సంపుటి "సామాజిక"ను 2015లో వెలువరించారు. ఇవిగాక దళిత సంబంధిత సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక అంశాల మీద వివిధ పత్రికల్లో వందకు పైగా వ్యాసాలు రాశారు. మరికొన్ని పరిశోధన పత్రాలు ప్రచురించారు. ఈయన ప్రస్తుతం వందేళ్ల ఆంధ్ర విశ్వవిద్యాలయం చరిత్రలో ముఖ్యఘట్టాల మీద వివిధ పత్రికల్లో వ్యాసాలు రాశారు. పురస్కార ప్రదాన కార్యక్రమంలో రాష్ట్ర సాంస్కృతిక మరియు సృజన శాఖ కార్యనిర్వహాక సంచాలకులు ఆర్. మల్లికార్జునరావు, విజయవాడ కలెక్టర్ ఎస్పీషా, చైర్మన్ పొడపాటి తేజస్విని ఇతర చైర్మన్లు, ఇతర రాష్ట్ర అధికారులు పాల్గొన్నారు.

క్రోమాలో డ్రీమ్స్ ఫెస్టివల్ ప్రారంభం

విశాలాంధ్ర - విశాఖపట్నం : టాటా గ్రూప్ నుండి భారతదేశంలోని ప్రముఖ ఓమ్ని-ఛానల్ ఎలక్ట్రానిక్స్ రిటైలర్ అయిన క్రోమా, వేడుకలకు మరింత మెరుపు మరియు ఆనందాన్ని జోడించడానికి ప్రత్యేకంగా రూపొందించిన అద్భుతమైన ఆఫర్‌లను అందించే దాని వార్షిక పండుగ ప్రచారం అయిన ఫెస్టివల్ ఆఫ్ డ్రీమ్స్‌తో పండుగ సీజన్‌కు నాంది పలికింది. కస్టమర్‌లు స్మార్ట్‌ఫోన్‌లు, టీవీలు, వాషింగ్ మెషీన్‌లు, ల్యాప్‌టాప్‌లు మరియు రిఫ్రిజిరేటర్‌లలో అద్భుతమైన క్యాష్‌బ్యాక్, ఈఎంఐ మరియు ఎక్స్ఛేంజ్ ప్రయోజనాలతో పాటు స్టోర్‌లో మరియు ఆన్‌లైన్‌లో అజేయ మైన డిస్కౌంట్‌లను ఆస్వాదించవచ్చు. ఇటీవలి జీఎస్టి సంస్కరణల కారణంగా టీవీలు మరియు ఎయిర్ కండిషనర్‌లపై అదనంగా 10 శాతం పొదుపు చేయడం వల్ల గృహోపకరణాలను అప్ గ్రేడ్ చేయడం మరింత ప్రతిఫలదాయకంగా ఉంటుంది. 200 కి పైగా నగరాల్లో 560 కి పైగా స్టోర్ల బలమైన ఉనికితో, క్రోమ.కామ్ మరియు టాటా న్యు యాప్‌లో సజావుగా షాపింగ్ చేయడంతో పాటు, కస్టమర్‌లు తమ కోసం షాపింగ్ చేసినా లేదా స్నేహితులు మరియు కుటుంబ సభ్యుల కోసం ఆలోచ నాత్మకమైన పండుగ బహుమతులను ఎంచుకున్నా, ఉత్తమ డీల్‌లను సులభంగా పొంద గలరని క్రోమ నిర్ధారిస్తుంది. అక్టోబర్ 23 వరకు బ్లాక్‌బస్టర్ డిస్కౌంట్లు, ఎక్స్ఛేంజ్ బోనస్‌లు, 20 శాతం వరకు క్యాష్‌బ్యాక్ ఆఫర్‌లు మరియు ఆకర్షణీయమైన ఈఎంఐ ప్రయోజనాలతో వినియోగ దారులు దసరా, ధన్‌తేరాస్, దీపావళి మరియు భాయ్ దూజ్‌లను ప్రత్యేకంగా చేసుకోవచ్చు.

కులాంతరవాహాలకు నిలిచిన ప్రోత్సాహం

రాష్ట్రంలో అమలు కాని పథకం

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : సమాజంలో సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు, కుల వివక్షను నిర్మూలించేందుకు ప్రోత్సహించాల్సి ప్రభుత్వం వీరిపై సవతి తల్లి ప్రేమ చూపిస్తుంది. ఈ పథకం అమలుచేయడం పట్ల నిర్లక్ష్య ధోరణి తో ఉంది. గత ప్రభుత్వం కళ్యాణమస్తు అని ,టిడిపి ప్రభుత్వం చంద్రన్న పెళ్లి కానుక పథకంగా ప్రకటించుకున్నారు. ఎన్నికల సందర్భంగా మేనిఫెస్టోలో కూడా గొప్పగా ప్రచారం చేసుకున్నారు. ఎన్నికలయ్యాక ఈ పథకాన్ని అమలు చేయడం మరిచారు.అతి తక్కువ బడ్జెట్ తో చిన్న మొత్తంతో లబ్ధి చేకూరే ఇలాంటి పథకాలు నిలిపివేయడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పథకంలో ఎస్సీ ఎస్టీలకు లక్ష రూపాయలు వరకు, బీసీలకు కులాంతర వివాహాలకు 75000 మంజూరు చేసేవారు. దీంతోపాటు గత ప్రభుత్వం పెళ్లి ఖర్చులు కూడా ప్రకటించింది. దారిద్ర్య రేఖకు దిగువన (బిపిఎల్) ఉన్న వారి కోసం ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. కొత్త ప్రభుత్వ ఏర్పడ్డాక ఈ పథకం అమలు జరగడం లేదని సాంఘిక సంక్షేమ శాఖ, బీసీ కార్పొరేషన్ ఉద్యోగులు వెల్లడి స్తున్నారు. కొంతకాలం డిఆర్డిఏ కూడా ఈ పథకాన్ని నిర్వహించినట్టు వీరు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఇలాంటి పథకాన్ని ప్రవేశ పెట్టినప్పటికీ అది కూడా అమలులో లేదు. వివాహం చేసుకొని కొత్తగా కుటుంబాన్ని ఏర్పాటు చేసుకునేవారికి కులాంతర వివాహ పథకం ద్వారా వచ్చే నిధులు ఎంతో ఉపయోగపడతాయి. నిరుపేద, దిగువ మధ్యతరగతి వారికి ఇంటి అవసరమైన సామాగ్రి కొనుగోలు చేసుకునేందుకు, వారు జీవితంలో ఏదైనా చిన్న వ్యాపారం పెట్టుకునేందుకు ఆసరాగా నిలిచేది. ఇటీవల కొత్తగా పెళ్లయిన జంటలు ఈ పథకం కోసం సాంఘిక సంక్షేమ శాఖను సంప్రదించి నిరాశతో వెలు తిరుగుతున్నారు. ప్రతి ఏటా వందల్లో మాత్రమే లబ్ధిదారులు ఉంటారు. వారికి ఇచ్చే మొత్తం కూడా చాలా తక్కువ కావడంతో రాష్ట్ర బడ్జెట్ మీద దీని ప్రభావం పెద్దగా ఉండ దని దళిత సంఘం నేతలు వెల్లడిస్తున్నారు. ఈ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు.